సాక్షి విజయనగరం

సోమవారం । 25 । నవంబర్ । 2024



అద్భుత అవకాశం

21వ శతాబ్దపు నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం ద్వారా వారిని ట్రాన్స్‌ఫర్మేటివ్ నాయకులుగా తీర్చి దిద్దవచ్చని అధికార యంత్రాంగం భావిస్తోంది. - 8లో



కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

రాష్ట్ర స్థాయిలో జరగనున్న సీనియర్స్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఆదివారం పూర్తయ్యాయి. - 8లో



సెల్‌టవర్ ఎక్కిన యువకుడు

ప్రేమించిన అమ్మాయి తనను పట్టించుకోకుండా అమ్మగారింటికి వెళ్లిపోతోందని, తనను పిలిపించి ప్రేమ, పెళ్లికి అంగీకరిస్తేనే దిగుతానంటూ ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కాడు. - 8లో

న్యూస్‌రీల్

2 వేల టన్నుల చెరకు క్రషింగ్



ఫ్యాక్టరీకి తరలించేందుకు సిద్ధం చేసిన చెరకు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో రెండు వేల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయినట్టు అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి రామిరెడ్డి ఆదివారం తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో సాగవుతున్న చెరకును నరికేందుకు తుని, అన్నవరం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి కూలీలు తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. ఈ క్రషింగ్ సీజన్‌లో 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యంగా ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం రైతులు కటింగ్ ఆర్డర్లు తీసుకుని, చెరకును నరికిన వెంటనే ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్టు చెప్పారు.

మద్యం దుకాణంపై మహిళల నిరసన



మద్యం షాపు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

బొబ్బిలి: పట్టణంలోని మేదరిబంద వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరే చోటుకు తరలించాలని కోరుతూ చేపట్టిన నిరసన కార్యక్రమం ఆదివారం రాత్రి కూడా కొనసాగింది. దుకాణం పరిసర ప్రాంతాల మహిళలు, యువత, స్థానికులు మద్యం దుకాణానికి వ్యతిరేకంగా నినదించారు. నివాస ప్రాంతాల్లో మద్యం షాపు ఉంచకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ ఏర్పాటు చేయడం దారుణమని మహిళలు ధ్వజమెత్తారు. ఇంత నిర్లక్ష్యంగా మద్యం దుకాణదారులు, అధికారు లు వ్యవహరించడం తగదని తరలించే వరకూ తమ ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలి

- డిసెంబర్ 21న జిల్లా కేంద్రంలో ధర్నా
- ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు సభ్యులు తీర్మానించారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు డిసెంబర్ 21న జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహించడానికి సభ్యులు సిద్ధం కావాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, మధ్యంతర భృతి 30 శాతం వరకు ఇవ్వాలని డిమాండ్ చేసారు. పెన్షనర్లకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 10 శాతం, 15 శాతం పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో అలక్ష్యం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్వీ పైడిరాజు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఆర్.కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.మధుసూదనరావు, జిల్లా కార్యదర్శి పి.దామోదర నాయుడు, జిల్లా అకడమిక్ కన్వీనర్ పి.బాబులాల్, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: వివిధ రంగాల్లో సేవలందించిన విద్యావంతులు, ఉపాధ్యాయులు, సమాజ సేవకులు, వైద్యులు, కళాకారులు, క్రీడాకారులు, కవులు, కర్షకులు తదితర వారి సేవలను గుర్తిస్తూ సేవానంది, సేవాభూషణ్ జాతీయ స్థాయి పురస్కారాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఐఎస్ఎస్.నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబరు 8న నిర్వహించే కార్యక్రమంలో పురస్కార ప్రదానోత్సవం ఉంటుందన్నారు. వివరాలకు 96523 47207 నంబరుకు సంప్రదించాలని కోరారు.

డెకాయ్ ఆపరేషన్లపై.. నిర్లక్ష్యం..!

- ఇష్టానుసారంగా స్కానింగ్ సెంటర్ల నిర్వహణ
- లింగ నిర్ధారణపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- తగ్గిపోతున్న బాలికల సంఖ్య
- జిల్లాలో 17 మండలాల్లో గణనీయంగా తగ్గిన వైనం
- 1000 మంది బాలురుకు 924 మంది బాలికలు
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు జరిగిన ప్రసవాల్లో తేలిన లెక్క





- జిల్లాలోని బొబ్బిలి మండలంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు జరిగిన ప్రసవాల్లో 441 మగ పిల్లలుంటే.. ఆడ బిడ్డలు 403 మంది జన్మించారు. ఈ లెక్కన వెయ్యి మంది మగ బిడ్డలకుగాను 914 మంది మాత్రమే ఆడ బిడ్డలు ఉన్నారు.
- చీపురుపల్లి మండలంలో కూడా అదే కాలంలో 212 మంది మగ పిల్లలు, 182 మంది ఆడ పిల్లలు జన్మించారు. ఇక్కడ కూడా 1000 మంది మగ పిల్లలకుగాను 858 మంది మాత్రమే ఆడపిల్లలు ఉన్నారు.
- గజపతినగరం మండలంలో కూడా 175 మంది మగ పిల్లలకుగాను 152 మంది ఆడపిల్లలు మాత్రమే జన్మించారు. 23 మంది ఆడపిల్లలు తక్కువగా ఉన్నారు. 1000 మంది మగ పిల్లలకుగాను 869 మంది ఆడపిల్లలు మాత్రమే ఉన్నారు.
- జిల్లాలో గడిచిన కొద్ది నెలల జననాల సంఖ్యను చూస్తే... బాలురుకు.. బాలికలకు మధ్య గణనీయమైన తేడా కనిపిస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే ఆడబిడ్డల సంఖ్య మరింత తగ్గేలా ఉంది. ఇలా జరగడానికి స్కానింగ్ సెంటర్ల నిర్వాకం కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన వైద్య శాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో అధిక శాతం మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఆడ పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం ఆందోళన కల్గిస్తున్న అంశం. భ్రూణ హత్యలను అరికట్టి ఆడపిల్లల సంఖ్యను పెంచడానికి చర్యలు తీసుకోవాల్సిన వైద్య ఆరోగ్య శాఖ చోద్యం చూస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాసుల కోసం స్కానింగ్ సెంటర్లపై కన్నెత్తి అయినా చూడడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా కొంతమంది స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిర్లక్ష్యం తగునా..

స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ వెల్లడించినట్టయితే కనుగొనేందుకు వైద్య ఆరోగ్య శాఖ డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాల్సి ఉంది. కానీ.. వైద్య ఆరోగ్యశాఖ డెకాయ్ ఆపరేషన్ల జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలున్నాయి. డెకాయ్ ఆపరేషన్ (అద్దెకు గర్భిణి) తీసుకుని స్కానింగ్ సెంటర్లకు రహస్యంగా పంపిస్తారు. ఆమె వెంటే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఉండి గర్భిణీని స్కానింగ్ సెంటర్లకు రహస్యంగా పంపించి లింగ నిర్ధారణ వెల్లడించాలని, అందుకోసం ఎంత డబ్బులైనా వెచ్చిస్తామని స్కానింగ్ సెంటర్లను అడుగుతారు. ఎవరైనా స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు లింగ నిర్ధారణ వెల్లడించినట్టయితే సదరు స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడిపై కేసు పెట్టి చర్యలు తీసుకుంటారు. డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించడం వల్ల లింగ నిర్ధారణకు అడ్డుకట్ట పడుతుంది. భ్రూణ హత్యలు ఉండవు. ఆడపిల్లల సంఖ్య పెరుగుతుంది.

ఆడపిల్ల పుట్టింది అంటే గతంలో మహాలక్ష్మి పుట్టిందని కుటుంబం అంతా సంతోషించేవారు. బంధువులందరికి మిఠాయిలు పంచుతూ ఆనందంగా గడిపేవారు. నేడు అందుకు విరుద్ధమైన పరిస్థితులున్నాయి. ఆడపిల్ల పుడితే భారమనే ధోరణిలో కొందరు తల్లిదండ్రులు ఉన్నారు. మరికొందరు తల్లిదండ్రులు కడుపులో ఉన్నది ఆడశిశువా, మగ శిశువా.. తెలపాలని స్కానింగ్ సెంటర్లపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. కొన్ని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు కాసుల కోసం లింగ నిర్ధారణ వెల్లడిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలిసి గర్భంలోనే తుంచేస్తున్నారు. వీటి వల్ల జిల్లాలో ఆడపిల్లల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. 1000 మంది ఆడపిల్లలకు కొన్ని చోట్ల 800 ఉంటే మరి కొన్ని చోట్ల 600, 700 మంది ఉంటున్నారు. కొన్ని చోట్ల అయితే 400 మందే ఉంటున్నారు. దీనిని బట్టి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

17 మండలాల్లో తక్కువగా ఉన్న ఆడపిల్లల సంఖ్య



జిల్లాలో 27 మండలాలు ఉంటే 17 మండలాల్లో ఆడ పిల్లలు తక్కువగా ఉన్నారు. బాడంగి, బొబ్బిలి, చీపురుపల్లి, దత్తిరాజేరు, డెంకాడ, గజపతినగరం, గంట్యాడ, గుర్ల, మెంటాడ, మెరకముడిదాం, నెల్లిమర్ల, వంగర, రాజాం, రేగిడి ఆమదాలవలస, ఎస్.కోట, వేపాడ మండలాల్లో ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉంది.

పర్యవేక్షణ కరువు

జిల్లాలో 70 వరకు స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి.



పీసీపీఎన్‌డీటీ యాక్ట్ వాల్‌పోస్టర్

వీటిపై పర్యవేక్షణ అంతంత మాత్రమేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి లింగ నిర్ధారణ ఎవరైనా వెల్లడిస్తున్నారా.. లేదా.. అని తనిఖీ చేయాల్సి ఉంది.

జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు మండలాల వారీగా జన్మించిన బాలురు, బాలికల సంఖ్యా వివరాలు...

మండలం	బాలురు	బాలికలు
బాడంగి	93	73
బొబ్బిలి	441	403
చీపురుపల్లి	212	182
దత్తిరాజేరు	12	05
డెంకాడ	15	11
గజపతినగరం	175	152
గంట్యాడ	08	06
గుర్ల	10	06
మెంటాడ	19	13
మెరకముడిదాం	16	09
నెల్లిమర్ల	634	568
రాజాం	1320	1158
ఆర్.ఆమదాలవలస	04	02
సంతకవిటి	05	02
ఎస్.కోట	471	386
వేపాడ	12	07
వంగర	03	01

డెకాయ్ ఆపరేషన్లు చేపడతాం..



ఇటీవలె నేను బాధ్యతలు చేపట్టాను. డెకాయ్ ఆపరేషన్లు చేపడతాం. ఆడ పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఆయా మండలాల పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్లను నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఇప్పటికే ప్రోగ్రాం అధికారులను ఆదేశించాం. లింగ నిర్ధారణ ఎక్కడైనా వెల్లడించినట్టు సమాచారం ఇస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కె.రాణి, డీఎంహెచ్‌ఓ

అవయవదానానికి మేము సిద్ధం



అవయవదానానికి అంగీకరిస్తూ గోవిందరాజులుకు పత్రాలు అందజేస్తున్న మెట్టపల్లి వాసులు

- 50 మంది అంగీకారం
- మానవీయత సంస్థకు అంగీకార పత్రాల అందజేత

చీపురుపల్లి: వారంతా పెద్దగా చదువుకోలేదు.. అయితేనేం ఎంతో మందికి ఆదర్శవంతమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 50 మంది ఒక్కటిగా ఆలోచించారు. పదుగురికి ప్రయోజనకరమైన నిర్ణయాన్ని తీసుకొని సంబంధిత అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. ఆ పత్రాలను అవయవదాన సంస్థలకు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి గ్రామానికి చెందిన 50 మంది నివాసితులు తమ మరణానంతరం అవయవదానానికి అంగీకారం తెలిపారు. సంబంధిత పత్రాలను చీపురుపల్లికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ, మెట్టపల్లికి చెందిన నవభారత్ ఫౌండేషన్ వారికి అందజేశారు. ఆదివారం మెట్టపల్లిలో ఏర్పాటు చేసిన అవయవదాన అవగాహన కార్యక్రమంలో ఈ పత్రాలను సంస్థ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు మాట్లాడుతూ అవయవదానం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అవయవదానం ద్వారా వైద్య శాస్త్రంలో ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని చెప్పారు. కొందరికి అవయవాలు దానం కూడా చేయవచ్చన్నారు. దాతల దాతృత్వాన్ని పలువురు అభినందించారు.

వైభవంగా ఆదిత్య హృదయ హోమం



రామస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో గాయత్రి రామాయణ, సుందరకాండ, ఆదిత్యహృదయం, ధన్వంతరీ హోమాలు, సుదర్శన అష్టకం, సుదర్శన కవచం, సుదర్శన మూలమంత్ర హవనం, తదితర కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. అనంతరం వెండి మంటపం వద్ద సీతారామస్వామిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి నిత్య కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్తీకమాసం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి దిక్సూచి రాజ్యాంగం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



చైతన్య యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: దేశ ప్రజాస్వామ్యానికి దిక్సూచిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం నిలుస్తుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భారత రాజ్యాంగం ఆమోదించబడి 76 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా అంబేడ్కర్ రైట్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి డిసెంబర్ 6 వరకు నిర్వహించనున్న భారత రాజ్యాంగం పరిరక్షణ చైతన్య యాత్ర కరపత్రాలను ప్రదీప్ నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం జెడ్పీ చైర్మన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించే పరిస్థితులు తలెత్తే తరుణంలో పలు అంశాలు పౌరుల హక్కులను కాపాడడంలో కీలక భూమిక వహిస్తున్నాయన్నారు. భారత రాజ్యాంగం రచన వల్ల భారత పార్లమెంటు వ్యవస్థ ద్వారా అట్టడుగు వర్గాల వారికి సామాజిక న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో భానుమూర్తి, పూసర్ల మధుసూదనరావు పాల్గొన్నారు.

విజయభావన 'సాహిత్య ప్రయోజనం'



ప్రధానవక్తను సత్కరిస్తున్న విజయభావన సాహితీ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన సాహిత్య ప్రయోజనం ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రధానవక్తగా విశాఖ గాయత్రీ విద్యాపరిషత్ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సర్వమంగళశాస్త్రి మాట్లాడుతూ సంప్రదాయాన్ని ఒక జీవ నదిగా పోలిక చేస్తూ, సంప్రదాయం లేనిదే ప్రగతి లేదని ఉద్ఘాటించారు. జీవ నదిలో కాలానుగుణంగా ఎన్నో పిల్ల కాలువలు వచ్చి చేరి బలాన్నిస్తాయని, అప్పుడప్పుడు మట్టి బురద చేరినా వాటిని పక్కకి తొలగించుకుని నిరంతరంగా ఈ సాహితీ గంగ ప్రవహిస్తుందన్నారు. నన్నయ్య నుంచి గురజాడ వరకూ సాహిత్యంలో స్థిరంగా నిలబడి ఉన్న మలిక సంప్రదాయ యోచనను ప్రామాణికంగా నిరూపించారన్నారు. ఆధునికం వచ్చినా మూలం మారలేదని వివరిస్తూ దాంపత్యం ధర్మంలో ఒకరినొకరు గౌరవించుకుంటూ ప్రేమను ఇచ్చిపుచ్చుకునే విధానాన్ని ఉదాహరించారు. సభాధ్యక్షతను గ్రంథాలయ సంస్థ పూర్వాధ్యక్షులు రొంగలిపోతన్న, సమ్మానకర్తగా ధర్మవరం విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు కొట్టు బాబూరావు వ్యవహరించారు. సభకు డాక్టర్ ఎ.గోపాలరావు స్వాగతం పలకగా, డాక్టర్ శిరీషా రఘురామ్‌లు వందన సమర్పణ చేశారు. సుందర యశస్వి, సుచిత్రా యశస్వి ప్రార్థన చేశారు. గురజాడ ఇందిరా స్వీయకవితా గానం చేసారు. కార్యక్రమంలో దవళ సర్వేశ్వరరావు, సోమేశ్వరరావు, ప్రాత రాజేశ్వరరావు, నీలాద్రి, హరిప్రియ, దామరాజు శంకరం, డాక్టర్ హరిచందన్, దుర్గాప్రసాద్, సభ్యులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఐపీఎల్ వేలంలో గరివిడి కుర్రోడు



యశ్వంత్

చీపురుపల్లి రూరల్(గరివిడి): బీసీసీఐ ఎంతో ప్రతిష్టాత్మకంగా దుబాయ్ దేశంలో నిర్వహిస్తున్న ఐపీఎల్ వేలానికి గరివిడి పట్టణానికి చెందిన బైలపూడి యశ్వంత్ అనే యువకుడు చేరుకున్నాడు. ఈ యువకుడు రూ.30లక్షల బేస్ ప్రైస్‌తో తన పేరును రిజిస్టర్ చేసుకున్నాడు. రైట్ ఆర్మ్ లెగ్ స్పిన్నర్‌గా క్రికెట్‌లో రాణిస్తూ ఐపీఎల్ ఆక్షన్ వరకు చేరుకున్నాడు. గరివిడి పట్టణంలోని ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువకుడు ఈ స్థాయికి చేరుకోవడంతో పట్టణవాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. యశ్వంత్ గరివిడిలోని గోదావరి దేవి షరాఫ్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో చదువుకున్నారు. చదువుకున్న రోజుల్లో స్కూల్‌లో ఏర్పాటు చేసిన క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందాడు. అక్కడ నుంచి క్రికెట్‌పై ఉన్న ఆసక్తితో ఆడుతూ జోన్ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభను చాటి నేడు ఐపీఎల్ వేలం వరకు చేరుకున్నాడు. యశ్వంత్ ఐపీఎల్‌లో ఎంపిక కావాలని ఈ ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.




హతవిధీ.. ఏంటీ దుస్థితి..!

బాడంగి మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర పాఠశాల విద్యార్థుల కష్టాలు చెప్పనలవి కానవిగా ఉన్నాయి. విద్యార్థుల స్నానాల గదుల్లోకి రన్నింగ్ వాటర్ రావడం లేదు. ఇక్కడ సుమారు 450 మంది ఇంటర్ విద్యార్థులున్నారు. టాయిలెట్స్ చాలకపోగా ఉన్న వాటికి రన్నింగ్ వాటర్ లేక ఆరుబయట మల విసర్జనకు పరుగులు తీస్తున్నారు. స్కూల్ ఆవరణలో బోరు వద్ద సామూహిక స్నానాలు చేస్తున్నారు. ఇలా దేనికదే.. అవస్థలు పెడుతున్నాయి. అయినా అధికారులు, పాలకులకు పట్టడం లేదు. – బాడంగి



ఎన్‌సీసీ దినోత్సవం

విజయనగరం మండలంలోని కోరుకొండ సైనిక పాఠశాలలో ఎన్‌సీసీ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వింగ్ కమాండర్ కిరణ్ సైనిక స్కూల్ యుద్ధ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. విద్యతో పాటే దేశభక్తి ప్రతీ ఒక్కరిలో అలవడిననాడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. ఎన్‌సీసీ, జేడీ సీఓవై ఎస్ఎస్‌కే వంటి రంగాల ద్వారా బాధ్యతలు నిర్వహించి దేశం కోసం ప్రాణాలర్పించిన సైనిక కుటుంబాలను ఆయన సత్కరించారు. పీఎస్ఓలు, పాఠశాల అధికారులు పాల్గొన్నారు. – విజయనగరం రూరల్



మహిళలూ.. మీరు ఆదర్శం..

రోజులు మారాయి. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. అంతరిక్షం నుంచి వ్యవసాయ రంగం వరకు అన్ని రంగాల్లో చెరిసగం అన్నట్టు సత్తా చూపుతున్నారు. వ్యవసాయ పనుల్లో కూడా కష్టపడడంలో పురుషులకు తామేమీ తీసుపోమని నిరూపిస్తున్నారు. ప్రస్తుతం రేగిడి, వన్నలి పరిసర గ్రామాల్లో చెరకు నరికివేత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనుల్లో మహిళలు పాల్గొని చెరకు నరికివేతతో పాటు మోతలో కూడా తమ సత్తా చూపుతున్నారు. ట్రాక్టర్లకు చెరకును కూడా వీరే లోడు చేస్తున్నారు. – రేగిడి

క్లుప్తంగా

పిక్నిక్ స్పాట్స్‌పై నిఘా



సముద్రతీరం వద్ద భద్రతా ఏర్పాట్లలో పూసపాటిరేగ పోలీసులు

విజయనగరం క్రైమ్: కార్తీక మాసం వారాంతం సందర్భంగా విహార యాత్రలు, పిక్నిక్‌లకు ఎక్కువ మంది ప్రజలు వెళ్లే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, ముందస్తుగా నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విహార యాత్రలు నిర్వహించే ప్రాంతాలు, పిక్నిక్ స్పాట్స్ వద్దకు వచ్చే మహిళలు, యువతులు, ఈవ్‌టీజింగ్‌కు, వేధింపులకు గురికాకుండా మహిళల భద్రతకు సంబంధిత అధికారులు భద్రత ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, డే బీట్లు, బందోబస్తు , మహిళా బీట్లను ఏర్పాటు చేసి, ఎటువంటి అల్లర్లు జరగకుండా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. పిక్నిక్ పేరుతో అసాంఘిక కార్యకలాపాల నిర్వహణకు తావులేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి, పేకాట , జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటి కార్యకలాపాలు జరగకుండా నిర్వాహకులతో ముందుగా సమావేశమై, అసాంఘిక కార్యకలాపాలు, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరడం, సత్ఫలితాలనిచ్చిందన్నారు. భద్రత ఏర్పాట్లను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించగా, సంబంధిత సీఐలు, ఎస్ఐలు భద్రతాచర్యలు చేపట్టారని వివరించారు.

పూరిల్లు దగ్ధం

మెంటాడ: మండలంలోని చింతలవలసలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన ముచ్చర్ల కోటేశ్వరరావు పూరిల్లు కాలిపోయింది. కోటేశ్వరరావు అతని భార్య ఉదయాన్నే దేవుడి మూలన దీపం పెట్టి పక్కనే ఉన్న పిట్టాడ గ్రామంలో వ్యవసాయ కూలీ పనులకోసం వెళ్లారు. వారు వెళ్లిన కాసేపటికి ఇంటినుంచి పొగలు రావడం గమనించిన సర్పంచ్ కలిశెట్టి సూర్యనారాయణ తక్షణమే స్పందించి చుట్టుపక్కల ప్రజలతో కలిసి ఆర్పేప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. దీపం అంటుకుని ఇల్లు కాలినట్లే స్థానికులు చెబుతున్నారు. ఇంట్లో ఉన్న బట్టలు, రూ.25 వేలు, పావుతులం బంగారం , ఇంట్లోని సామగ్రి, తిండి గింజలు మొత్తం కాలిపోయాయని బాధిత కోటేశ్వరరావు దంపతులు లబోదిబోమంటున్నారు. సుమారు లక్షరూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. సమాచారం మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధారాణి, వీఆర్‌ఓ కొండమ్మ వచ్చి కాలిపోయిన ఇంటిని పరిశీలించారు.

పోలీసుల అదుపులో పేకాటరాయళ్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఎస్సై బి.గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి దగ్గర ఉన్న రూ.13,150 నగదు సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం కోర్టుకు అప్పగించారు. బహిరంగ ప్రదేశాల్లో జూదం ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. గ్రామాల్లో కోడిపందాలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఫోన్ 9121109444 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

1400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సాలూరు రూరల్: మండలంలోని సారిక, నేరెళ్లవలస గ్రామాల మధ్యలో నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రాలపై రూరల్ ఎస్సై నరసింహమూర్తి సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం దాడి చేసి 1400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. తయారీ కేంద్రం వద్ద నేరెళ్లవలసకు చెందిన డిప్ప చిన్నయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడిలో కానిస్టేబుల్స్ శివశంకర్, గొర్లె గోపి, రాబాబు, సురేష్ పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹132	₹234	₹244

విద్యార్థుల ఆలోచనకు అద్భుత అవకాశం

- కేంద్ర సహకారంతో స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్
- ఆలోచనల సమర్పణకు ఈనెల 30 వరకూ గడువు



ఈ తరహా విద్యార్థులు తమ ఆలోచనకు పదును పెట్టాల్సి ఉంది

పాలకొండ రూరల్: కేంద్రప్రభుత్వం చొరవతో 21వ శతాబ్దపు నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం ద్వారా వారిని ట్రాన్స్‌ఫర్మేటివ్ నాయకులుగా తీర్చిదిద్దవచ్చని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ క్రమంలో ఉద్దేశించిన కార్యక్రమమే స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ, అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. 2023వ సంవత్సరంలో నిర్వహించిన కార్యక్రమంలో19 వేల మందికి పైగా విద్యార్థులు తమ అలోచనలకు పదునుపెట్టి ఇన్నోవేషన్‌లను రూపొందించారు. తాజాగా 2024లో ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రక్రియ ఈ ఏడాది ఆగస్టులో మొదలైంది. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులతో నమోదైన ఐడియాలలో మొదటి 400 స్థానాల్లో నిలిచిన ప్రాజెక్ట్స్ ఇంటర్న్‌షిప్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అందులో మొదటి 75 స్థానాలలో నిలిచిన ప్రాజెక్ట్స్‌కు మెంటర్‌షిప్‌ను అందిస్తారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అటల్ ఇన్నోవేషన్ మిషన్ అందిస్తుంది. విద్యార్థులకు నగదు బహుమతిని నీతి ఆయోగ్ అందించి ప్రోత్సహిస్తుంది. ఇందుకు సంబంధించి 6–10 తరగతుల మధ్య విద్యార్థులు అర్హులుగా విద్యాశాఖ స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 180 పాఠశాలలు రిజిస్టర్ చేసుకోగా 536 మంది ఉపాధ్యాయుల సహకారంతో 4010 మంది విద్యార్థులు 1429 థీమ్స్‌ను సిద్ధం చేశారు.

థీమ్స్ ఇలా..

1. డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్
2. అర్టిఫిషల్ ఇంటలిజెన్స్
3. ఆరోగ్యం/సంరక్షణ
4. ఎకానమిక్ ఎంపవర్‌మెంట్

గడువులోగా సబ్‌మిట్ చేయాలి



ఇప్పటికే జిల్లాలోని అందరు సైన్స్ ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ మోడ్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి ఓరియంటేషన్ పూర్తి చేశాం. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. రిజిస్టర్ అయిన విద్యార్థులు తమ ఆలోచనలను సబ్‌మిట్ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఈనెల 30 లోగా పూర్తిచేయాలి. సాంకేతిక సమస్యలు ఏవైనా ఉంటే ఫోన్ 8978077156 నంబర్‌ను సంప్రదించవచ్చు.

– జి.లక్ష్మణరావు, జిల్లా సైన్స్ అధికారి, పార్వతీపురం మన్యం

విద్యార్థులను సిద్ధం చేయాలి



సైన్స్ ఉపాధ్యాయులు తమ పరిధిలో విద్యార్థులను ఈ అద్భుతమైన కార్యక్రమానికి సిద్ధం చేయాలి. గత అనుభవాలను, విజయాలను స్ఫూర్తిగా పొంది రిజిస్టర్ అయిన విద్యార్థులు తప్పనిసరిగా వారి ఆలోచనలు సబ్‌మిట్ చేసి మరోసారి జిల్లాను ముందువరుసలో ఉంచాలి. మన్యం జిల్లాలో లేదా ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంచుకుని పరిష్కారం చూపేలా విద్యార్థుల నుంచి ఐడియాలను రాబట్టాలి. టీమ్స్ ఐడియా సబ్మిషన్ ప్రతిరోజూ పరిశీలిస్తున్నాం.

– ఎస్.తిరుపతినాయుడు, డీఈఓ, పార్వతీపురం మన్యం

రిజిస్ట్రేషన్ ఇలా..

ఇప్పటికే స్టూడెంట్ రిజిస్ట్రేషన్, టీచర్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో 6 నుంచి 10 తరగతుల మధ్య బోధన సాగిస్తున్న విద్యార్థులు (httpr://rchooinnovation marathon.orf/) లో రిజిస్ట్రేషన్ అయ్యాక పైన తెలిపిన థీమ్‌లలో ఎదో ఒక థీమ్‌లో ఒక సమస్యకు పరిష్కారాన్ని చూపే ఐడియాను సబ్‌మిట్ చేయాలి. ఆపై టాప్‌లో ఉన్న ప్రాజెక్ట్ ఐడియాలను ఎంపిక చేసి వాటికీ మెంటర్‌షిప్ ఇస్తారు. ప్రాజెక్ట్ ఐడియాను ఫొటోటైపుగా చేయడానికి కావాల్సిన టెక్నాలజీని అటల్ ఇనోవేషన్ మిషన్ ఇస్తుంది. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 30 లోగా తమ ఐడియాలను సబ్‌మిట్ చేయాలి.

మెరిట్ సర్టిఫికెట్స్ అందజేత

ప్రతి రాష్ట్రం నుంచి టాప్ 20 టీమ్స్‌కు, ప్రతి ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ నుంచి టాప్ 20 టీమ్స్‌కు, గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చే మొదటి 20 టీమ్స్, ప్రభుత్వ పాఠశాలల నుంచి టాప్ 20 స్కూల్స్, ప్రత్యేక అవసరాలు గల పిల్లల ద్వారా వచ్చే టాప్ 20 టీమ్స్‌కు మెరిట్ సర్టిఫికెట్స్ ఇస్తారు.

సాక్షి స్పెల్ బీ, మాథ్ బీలకు విశేష స్పందన



ఏకాగ్రతగా పరీక్షలో పాల్గొన్న విద్యార్థిని

విజయనగరం అర్బన్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి డక్స్ వాఫీ సంస్థ స్పాన్సర్‌గా, రాజమండ్రి ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అసోసియేట్ స్పాన్సర్‌గా ఆదివారం జిల్లాకేంద్రం సమీప పెదతాడివాడలోని నేషనల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన 'మ్యాథ్స్ బీ, స్పెల్ బీ' జిల్లా స్థాయి ప్రతిభావంతుల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. పోటీలలో భాగంగా తొలిరౌండ్ పోటీలు గత నెల జిల్లావ్యాప్తంగా పాఠశాల స్థాయిలో పలు పాఠశాలల్లో జరిగాయి. ఆ పోటీల విజేతలు రెండో రౌండ్ (క్వార్టర్‌ఫైనల్) పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలు విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తిని నింపాయి. ఈ పోటీల విజేతలు త్వరలో విశాఖలో జరిగే డివిజన్ స్థాయి (సెమీఫైనల్స్) పోటీల్లో పాల్గొంటారు. అక్కడి విజేతలకు నాలోగో రౌండ్‌గా నిర్వహించే ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతుంది. తొలుత ఈ పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు ప్రారంభించారు. వివిధ కేటగిరిల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి మూడు గంటల పాటు స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కేటగిరిల విద్యార్థులు మాట్లాడుతూ సాక్షి అందించిన ప్రిపరేషన్ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడిందని, ఈ పరీక్షల్లో పాల్గొనడం వల్ల మ్యాథమెటిక్స్‌లోని క్లిష్టమైన ఫార్ములాస్ సాల్వ్ చేయడంలో మర్చిపోలేని అనుభవం వచ్చిందని చెప్పారు.





పరీక్షలు రాయడానికి వెళ్తున్న విద్యార్థులు



విద్యార్థులకు ప్రశ్నపత్రాలు ఇస్తున్న ఇన్విజిలేటర్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఉమా జూట్ మిల్‌ను డిసెంబర్ 4 లోగా తెరవాలి

- లేదంటే ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధం
- కార్మిక సంఘం సాధారణ సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు గణేష్ పండా

కొత్తవలస: మండలంలోని సీతంపేట సమీపంలో గల ఉమా జూట్‌మిల్‌ను డిసెంబర్ 4వ తేదీ లోగా తెరవాలని లేదంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని కార్మిక సంఘం అధ్యక్షుడు గణేష్ పండా స్పష్టం చేశారు. ఈ మేరకు కర్మాగారం ఆవరణలో కార్మిక సంఘం సాధారణ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేయింబవళ్లు కార్మికులు 45 సంవత్సరాలుగా యాజమాన్యానికి సహకరిస్తూ 3 స్పిన్నింగ్ ఫ్రేమ్స్ నుంచి 22 స్పిన్నింగ్ ఫ్రేమ్స్‌కు, 100 మగ్గాలు పెట్టిన పురిమిల్లు నుంచి గోనె సంచులను ఉత్పత్తి చేసే మిల్లుగా అభివృద్ధి చేశామన్నారు.ఈ మిల్లులో వచ్చిన లాభాలతో ఇతర ప్రాంతాల్లో యాజమాన్యం పెద్ద ఎత్తున ఆస్తులను కూడపెట్టుకుని ఆరోపించారు. మిల్లులో తయారైన ఉత్పత్తి అమ్ముడు పోలేదని, ముడిసరుకు ధర పెరిగిపోయిందన్న నెపంతో ఈ ఏడాది జూలై-15న కర్మాగారాన్ని యాజమాన్యం మూసివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నాలుగువందల మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. జేసీఎల్, సీసీఎల్ ఆధ్వర్యంలో పలు దఫాలు చర్చలు నిర్వహించినప్పటికీ ఈ చర్చలకు యాజమాన్యం గైర్హాజరవుతూ వచ్చిందని, వచ్చేనెల 4లోగా కర్మాగారాన్ని తెరవని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.శ్రీను, కె.ఈశ్వరరావు, ఎస్.గోవింద, ఎస్.రాంబాబు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి మహిళ దుర్మరణం

- భర్త, పిల్లలకు గాయాలు
- ఆడలి ఘాట్‌రోడ్డులో ప్రమాదం



భారతి మృతదేహం

సీతంపేట: అందరిలాగే ఆ కుటుంబం కూడా పిక్నిక్‌లో భాగంగా ఆదివారం ఆడలి వ్యూపాయింట్‌ను సందర్శించి ఆనందంగా గడిపింది. ఆ ఆనందంలో తేలియాడుతున్న లోగానే మృత్యువు ఆ కుటుంబంలోని మహిళను కబళించింది. భర్త, పిల్లలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. పాలకొండకు చెందిన దుప్పాడ దుర్గారావు, భార్య భారతి, పిల్లలు మేఘన, పల్లవిలు ద్విచక్రవాహనంపై సీతంపేట ఏజెన్సీలో మారుమూల ఉన్న పర్యాటక ప్రదేశమైన ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఘాట్‌రోడ్ బిడిందిగూడ మలుపు వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి లోయలో పడడంతో భారతి (33) అక్కడికక్కడే దుర్మరణం చెందింది. భర్త దుర్గారావుకు తీవ్రగాయాలు, పిల్లలకు గాయాలు కావడంతో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇదే ఆస్పత్రికి భారతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసును మోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

సెపక్‌తక్రా సబ్ జూనియర్స్ పోటీలకు జిల్లా జట్ల పయనం



నందికొట్కూరులో పోటీలకు పయనమవుతున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సెపక్‌తక్రా సబ్‌జూనియర్స్ బాల, బాలికల పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు ఆదివారం పయనమయ్యాయి. ఈనెల 26,27 తేదీల్లో నంద్యాల జిల్లా నందికొట్కూరులో అంతర్ జిల్లాల సెపక్‌తక్రా పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో జిల్లానుంచి పాల్గొనే జట్లు పయనమవగా..జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురానఅయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు క్రీడాకారులకు సలహాలు, సూచనలు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజేష్, అధ్యక్షుడు ఆదినారాయణ, కోశాధికారి భవాని, పీడీలు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు విద్యార్థుల ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన పారాది జెడ్పీహెచ్ స్కూల్ క్రీడాకారులు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 22 నుంచి 24వరకు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ అండర్ 14 విభాగం క్రీడా పోటీలు చిత్తూరులో జరగ్గా ఆ పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన తమ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్రావు తెలిపారు. ఎంపికైన వారిలో సీహెచ్ గౌతమ్, మణికంఠ, పవన్, ఇందు, అవంతికలు ఉన్నారని, డిసెంబరులో జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని హెచ్ఎం తెలియజేశారు.

అపార్‌తో విద్యార్థులకు కష్టాలు

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్

పార్వతీపురంటౌన్: అపార్ ఐడీతో విద్యార్థులు తీరని కష్టాలు ఎదుర్కొంటున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదంతో దేశవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రేషన్ (అపార్) పేరిట జారీ చేస్తున్న కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలతో పాటు పార్వతీపురం జిల్లాలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాటి పరిష్కారానికి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఉన్న ఆధార్ కార్డులో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పేర్లలో తప్పులు, స్కూల్ రికార్డుల్లో జన్మదిన తేదీల మార్పు, చిన్నపాటి అక్షర దోషాలు, గ్రామ, నగరపంచాయతీ పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థలో నమోదై ఉన్న జనన ధ్రువీకరణ పత్రాల్లో విద్యార్థుల ఇంటి పేర్లు, పూర్తిపేర్లు నమోదు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నచిన్న అక్షర తప్పులు తదితర సమస్యలు సరిచేసేందుకు విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు ఆధార్ నమోదు కేంద్రాలు లేకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బర్త్ సర్టిఫికెట్ కావాలంటే వీఆర్‌ఓలు వేలాది రూపాయలు విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర వసూలు చేస్తున్నారని, దీనిపై తక్షణమే కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక పూర్తి




సీనియర్స్ కబడ్డీ జట్ల ఎంపికలో అర్హత సాధించిన జిల్లా క్రీడాకారులు


విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఆదివారం పూర్తయ్యాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 100మందికి పైగా క్రీడాకారులు తలపడ్డారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది పురుషులు, 16 మంది మహిళా క్రీడాకారులు విజయనగరం జిల్లా జట్లకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులకు మంగళవారం నుంచి రాజీవ్‌క్రీడామైదానంలో కోచింగ్ క్యాంప్ నిర్వహించిన అనంతరం అందులో మెరుగైన ఆట తీరును కనబరిచే 12 మంది క్రీడాకారులను ఒక్కో జట్టులోకి ఎంపిక చేయనున్నారు. తుది జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరగనున్న అంతర్ జిల్లాల సీనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో విజయనగరం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం హించనున్నారు. ఎంపిక పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవీపీ రాజు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, అసోసియేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, కోశాధికారి శివకుమార్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

సెల్‌టవర్ ఎక్కిన యువకుడు

- మైనర్‌తో పెళ్లికి అంగీకరించాలని డిమాండ్
- కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు
- బాలికను వేధిస్తున్నాడని తల్లిదండ్రుల ఫిర్యాదు



సెల్‌టవర్ నుంచి మాట్లాడుతున్న యువకుడు



గుమిగూడిన జనం

బొబ్బిలి: ప్రేమించిన అమ్మాయి తనను పట్టించుకోకుండా అమ్మగారింటికి వెళ్లిపోతోందని, తనను పిలిపించి ప్రేమ, పెళ్లికి అంగీకరిస్తేనే దిగుతానంటూ ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కి అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో ఉంటున్న సింగనపల్లి అజయ్‌కుమార్ అనే ఇంటర్‌మీడియట్ విద్యార్థి పదో తరగతి నుంచి తనకు పరిచయమున్న ఓ బాలికను ప్రేమించాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆ బాలిక అమ్మమ్మగారింటి వద్ద ఉండి(అజయ్ ఉన్న ప్రాంతంలోనే)చదువుకుంటోంది. అయితే బాలిక అమ్మగారింటికి వెళ్లిపోతున్నట్లు తెలిసి అడ్డుకునే ప్రయత్నం చేసిన అజయ్‌పై తల్లిదండ్రులు పోలీసు రిపోర్టు ఇవ్వగా అజయ్‌ను పిలిచి పోలీసులు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి ఇటువంటి పనులొద్దని హెచ్చరించారు. దీంతో కోపం పెంచుకున్న అజయ్ గొల్లపల్లిలోని ఓ సెల్‌టవర్ ఎక్కి బెదిరింపులకు దిగాడు. గతంలో ఎన్నడూ ఈ ప్రాంతంలో జరగని సంఘటన కావడంతో స్థానిక ప్రజలు గుమిగూడారు. అజయ్ భవానీ మాలలో ఉండడంతో ప్రజలతో పాటు భవానీ మాలాధారులు కూడా అక్కడికి చేరుకున్నారు. సుమారు రెండు గంటల సేపు సెల్‌టవర్ ఉన్న ప్రాంతం వద్ద ఉద్విగ్న భరిత వాతావరణం నెలకొంది. సెల్‌టవర్ చివరికంటా ఎక్కి అటూ ఇటూ తిరుగుతున్న యువకుడ్ని కిందనున్న వారు గెంతవద్దు..కిందికి దిగు అంటూ కేకలు వేస్తున్నా యువకుడు చలించలేదు. తాను ప్రేమించిన అమ్మాయి పేరుచెప్పి ఇక్కడికి తీసుకువచ్చి తన ప్రేమను అంగీకరిస్తున్నానని చెప్పాలని, అప్పుడే దిగుతానని చెప్పడంతో పోలీసులు అమ్మాయిని తీసుకుని వచ్చారు. బాలికతో ప్రేమ, పెళ్లికోసం ఒప్పుకోవాలని సెల్‌టవర్ పైనుంచే యువకుడు చెప్పడంతో కిందికి దిగితే మాట్లాడదామని చెప్పించారు.

పోక్సో కేసు నమోదు

అనంతరం యువకుడ్ని కిందికి దించారు. యువకుడిని అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తనకు మైనార్టీ తీరలేదని, తీరిన వెంటనే పెళ్లి చేసుకుందామని బాలిక చెప్పిందని, ఇద్దరం ప్రేమించు కున్నామని అజయ్ పోలీసులకు చెప్పాడు. డీఎస్పీ పి. శ్రీనివాసరావు బాలిక ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలిక, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అజయ్‌పై ఎస్సై రమేష్ పోక్సో కేసు నమోదు చేశారు. దీంతో కథ సుఖాంతమైందని అంతా ఊపిరి పీల్చుకున్నారు.